గ్రామీణ రోడ్లకు మహర్దశ

- బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు
- తీరనున్న వాహనదారుల కష్టాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


కంకర తేలిన రోడ్డు

పరిగి: గ్రామాల్లోని మట్టి రోడ్లన్నీ ఇక నుంచి బీటీ రోడ్లుగా కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు పూర్తయితే రవాణాసౌకర్యం మరింత మెరుగుపడుతుంది. రైతులకు, ప్రజలకు పంట పొలాలలకు వెళ్లే దారి ఏర్పడుతుంది. ఎన్నో సంవత్సరాలుగా కంకర తేలిన రోడ్లతో, గుంతలమయంగా మారిన మట్టి రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. రెండు గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్లు సైతం బీటీ రోడ్లుగా మారనున్నాయి. నియోజకవర్గంలో మంజూరైన రూ. 20కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం చేయనున్నారు.

రూ.20 కోట్లతో రహదారుల నిర్మాణం

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ నిధుల నుంచి రూ. 20 కోట్ల నిధులను మంజూరు చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గ్రామాల్లో ప్రచారం నిర్వహించే క్రమంలో బీటీ రోడ్లు వేయించాలని వచ్చిన వినతులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరూ చేయించారు. దీంతో నియోజకవర్గంలో రోడ్డు సౌకర్యం లేని 9 గ్రామాలకు బీటీ రోడ్లను నిర్మించనున్నారు. గతంలో మట్టి రోడ్డుతో నానా ఇబ్బందులు పడిన ప్రజలు, వాహనదారులు త్వరలోనే అవి బీటీ రోడ్లుగా మారనుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో రో జుల తరువాత రోడ్లసౌకర్యం చేపట్టనుండడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైన రహదారుల వివరాలు

లక్నాపూర్ నుంచి బీజాపూర్ వరకు నిర్మాణానికి రూ. 6.3కోట్లు, సుల్తాన్‌పూర్ నుంచి సుల్తాన్‌పూర్ తండా వరకు రూ.2కోట్లు, గూడూర్ నుంచి శివారెడ్డిపల్లి వరకు రూ.1.20 కోట్లు, దొంగఎన్కెపల్లి నుంచి దోర్నాపల్లి పిడబ్ల్యురోడ్డు వరకు రూ.1.28కోట్లు, ఎన్కెపల్లి నుంచి చెంచుపల్లికి రూ. 1 కోటి, జెడ్పీ రోడ్డు నుంచి బలరాంతండా వరకు రూ.97లక్షలు, గండీడ్ మండలంలో పీడబ్ల్యూ రోడ్డు నుంచి చెన్నాయపల్లికి రూ.3.60 కోట్లు, నంచెర్ల నుంచి చౌదర్‌పల్లికి రూ.2కోట్లు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు సంతోషకరం



దోర్నాపల్లి నుంచి దొంగఎన్కెపల్లి గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు మొత్తం కంకర తేలి ఉంది. గత ప్రభుత్వంలో రోడ్డు వేయాలని ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడం సంతోషకరం.

– శ్రీనివాస్, దోర్నాల్‌పల్లి

అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేయిస్తా



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేయిస్తా. నియోజకవర్గంలోని 9 గ్రామాలకు రూ. 20కోట్లు మంజూరయ్యాయి. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా. ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తా.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

హాజరుశాతం పెంచేందుకు కృషి

ఎంఈఓ నర్సింగ్‌రావు


రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

పెద్దేముల్: పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగేందుకు కృషి చేయాలని ఎంఈఓ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హరిజన వాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ప్రతి పాఠశాలల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలకు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతిరోజు మెను ప్రకారం మధ్యాహ్నభోజనం కొనసాగించాలన్నారు. సోమవారం, బుధవారం, శుక్రవారం తప్పకుండా గుడ్లు ఇవ్వాలన్నారు. గుడ్లు ఇవ్వడం లేదని, ఫిర్యాదులు వస్తే బిల్లులు నిలిపేస్తామని హెచ్చరించారు. తాగునీటి ఏరియా, తాగునీటి కుండీలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు సెలవు పెట్టినా, ఎక్కడకు వెళ్లినా ఆయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలన్నారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు

మిషన్ భగీరథ ఏఈఈ అభిషేక్


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అభిషేక్

మోమిన్‌పేట: గ్రామాలలో మిషన్ భగీరథ తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఏఈఈ అభిషేక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మూడోరోజు గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. తాగు నీటికి సంబంధించిన సింగిల్ ఫేజ్ మోటారు, చేతి పంపుల మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత సహాయకులదేనన్నారు. గ్రామాల్లో తాగు నీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లికేజీలు సంభవిస్తే వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను ప్రతీ 10రోజులకోమారు శుభ్రం చేయాలన్నారు. మిషన్ భగీరథ డీఈఈ సువర్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీఐ భీంకుమార్ బాధ్యతల స్వీకరణ



అనంతగిరి: వికారాబాద్ టౌన్ సీఐగా భీం కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొంరాస్‌పేట: తుంకిమెట్లలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పాల్గొన్నారు.

జిల్లా సహకార సంఘం డైరెక్టర్‌కు సన్మానం


కనకం మొగులయ్యను సన్మానిస్తున్న వెంకట్

కుల్కచర్ల: జిల్లా సహకార సంఘం డైరెక్టర్‌గా ఎంపిక కావడం పట్ల పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్యను బుధవారం సహకార సంఘం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామి దేవాలయం ప్రారంభం

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి తండాల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి, శివలింగం మరియు ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. దేవాలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఆడ పడుచులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ దాత పుత్ర అనంతయ్య, శివలింగం దాత పుత్ర దశరత్, గణపతి విగ్రహ దాత చంద్రారెడ్డి, ఆంజనేయ స్వామి విగ్రహ దాత శివరాం నాయక్, నంది విగ్రహ దాత పుత్రపెంటయ్య ప్రత్యేక పూజలతో విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20వ తేదీల్లో తాండూర్ పట్టణ కేంద్రంలో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మిక, కర్షక, పేదల పక్షపాతి సీపీఎం అని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న సభకు భారీగా కార్యకర్తలు, రైతులు తరలి రావాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు లక్ష్యం

కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నర్సిములు

పెద్దేముల్: మారుమూల గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషకరమని తాండూరు నియోజక వర్గ కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సిములు పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండల అడ్కిచెర్ల గ్రామంలో ఎల్ఎస్ఆర్ యువసేన సహకారంతో వికారాబాద్ మహవీర్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శివరాంనాయక్, బాబుసింగ్, నర్సింహరెడ్డి, అంజి, మైపాల్, రుక్మోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం


ఆసిఫ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

కొడంగల్ రూరల్: వ్యవసాయ మార్కెట్ నూతన డైరెక్టర్‌గా ఆసిఫ్‌ఖాన్‌ను ఎన్నుకున్న నేపథ్యంలో మక్కామసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ మన్నాన్ రహెబార్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు బుధవారం శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆఫీస్ అబ్దుల్ రషీద్ సాహెబ్, మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం గౌసన్, ఆఫీస్ కరీం అఫ్రషీ, అబ్దుల్‌ఖాదర్, రహిమత్‌ఖాన్, డాక్టర్ హాజి, జయత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటును నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ విజయకుమార్


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జాబితాలో తప్పొప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

పాదయాత్రగా శబరికి అయ్యప్పస్వాములు

పరిగి: పట్టణ కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ముకుంద కిష్టయ్య గురుస్వామి, పర్షమోని రమేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో నస్కల్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు 20 మంది శబరికి బయలు దేరారు. పట్టణ కేంద్రంలోని బహార్‌పేట్ హనుమాన్ దేవాలయంలో ఇరుముడి కట్టుకుని కాలినడకన వెళ్లారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

అనంతగిరి: ప్రతీ సంవత్సరం మాదిరిగానే వర్షాకాలం ప్రారంభం నుంచే 75% సబ్సిడీపై మేలుజాతి గడ్డి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వికారాబాద్ జిల్లా పశువైద్యాధికారి సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతీ పశువైద్య సెంటర్‌లో అవి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

అనంతగిరి: పాడి పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది 60 బృందాలుగా ఏర్పడి నెలరోజుల పాటు పతీరోజు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

కొడంగల్ రూరల్: ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలో 27మంది ఎస్‌జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్స్‌లతో కలిపి 31మంది ఉపాధ్యాయులు వివిధ గ్రామాల్లో విధుల్లో చేరేందుకు ఆర్డర్ కాపీని బుధవారం ఎంఈఓ రాంరెడ్డి సంబంధిత ఉపాధ్యాయులకు అందజేశారు.

ఆర్థిక సాయం

తాండూరు రూరల్: మల్కాపూర్ గ్రామానికి చెందిన విశ్వనాథ్ రావు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్‌సీ గౌడ్ మృతుని కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం బుధవారం రూ.5 వేలు సాయం చేశారు.

ప్లేట్ల పంపిణీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వర్గీయ నాగప్ప జ్ఞాపకార్థం అతని కుమారుడు రవి పటేల్ బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, శశివర్ధ, గ్రామస్తులు శివప్ప, నర్సిములు పాల్గొన్నారు.

గోలోక సేవలు ప్రశంసనీయం

బంట్వారం: అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఓ వ్యక్తి నాగసాన్‌పల్లి లైఫ్ ఫౌండేషన్‌లో గోవులకు 50కేజీల అరటి పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా గోలోక వారి సేవలను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు తపస్ సన్మానం

పెద్దేముల్: మండల ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన నర్సింగ్‌రావుకు బుధవారం పెద్దేముల్ మండల శాఖ తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేష్, సంతోష్‌కుమార్, జిల్లా మీడియ కన్వీనర్ గాజుల బస్వరాజ్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, పట్లోళ్ల అనిల్ ఘనంగా సన్మానం చేశారు.

19న శాంతి సంఘీభావ సంఘం మహాసభ

తాండూరు టౌన్: ఈ నెల 19వ తేదీన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ప్రథమ మహాసభ వికారాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి తలారి రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్‌హాల్లో ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని తెలిపారు.


యాలాల: నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న పీఆర్టీయూ నాయకులు


దుద్యాల్: చిలుముల్ మైల్వార్ ఎంపీ–యూపీఎస్ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు

కొత్త టీచర్లు వచ్చేశారు

నియామక పత్రాలు అందజేసిన ఎంఈఓలు


ధారూరు: సర్వీస్ బుక్కులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి


తాండూరు రూరల్: నియామక పత్రం అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు

పెద్దేముల్: పెద్దేముల్ మండలానికి 19 మంది ఉపాధ్యాయులకు బుధవారం ఎంఆర్‌సీ భవన్‌లో విద్యాధికారి నర్సింగ్‌రావు నియామక పత్రం అందజేశారు. 17 మంది ఎస్‌జీటీలు, ఒకరు స్కూల్ అసిస్టెంట్, మరోకరు తెలుగు లాంగ్వేజ్ పండిట్(ఎల్‌పి)లను నియమించినట్లు తెలిపారు.

యాలాలలో..

యాలాల: అగ్గనూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి ఎంపికైన ఆయా ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్టారెడ్డి, రాములు స్వాగతం పలికారు. బాణాపూర్, దుబ్బలతండా, గోరేపల్లి, సంగాయిగుట్ట తండా, సంగాయిపల్లి, తొప్పెర్లగడ్డ తండా, ఆర్జీకే కాలనీ, చెన్నారం పాఠశాలలకు 9 మంది విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండలానికి 11 మంది ఉపాధ్యా యులను కేటాయించినట్లు విద్యాధికారి విజయరామారావ్ తెలిపారు. ఎస్జీటీలను చిలుముల్ మైల్వా ర్, నాజుఖాన్‌పల్లి, సంత్రకుంట తండా, గడ్డమీది తండా, ఆలేడ్ గ్రామాల పాఠశాలలకు కేటాయించగా చిలుముల్ మైల్వార్ ఎంపీ–యూపీఎస్ పాఠశాలకు 5 గురు స్కూల్ అసిస్టెంట్‌లు, దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లు, హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 4 గురు స్కూల్ అసిస్టెంట్‌లను కేటాయించారు.

ధారూరులో..

ధారూరు: నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పోస్టింగులు ఇచ్చారు. నాగసమందర్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా ఒకరికి, తరిగోపుల పాఠశాలకు ఒకరిని ఫిజికల్ డైరెక్టర్‌గా, ఇద్దరికి ఎస్‌జీటీలుగా ఎబ్బనూర్, కుమ్మర్‌పల్లి పాఠశాలలను కేటాయించారు.

సర్వీస్ బుక్కు అందజేత..

నలుగురికి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల పీఆర్టీయూ నాయకులు స్వాగతం పలికి, శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి సర్వీస్ బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వం, మల్లికార్జున్, మాణిక్యం, శ్రీనివాస్, రమేశ సుధాకర్, మోహన్‌రెడ్డి, రాజేశ్, సోమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: రేగడిమైలారం, చిల్మల్‌మైలారం ఉన్నత పాఠశాలలకు 10మంది ఉపాధ్యాయులను నియమించారు. రేగడిమైలారం ఉన్నత పాఠశాలకు తెలుగు, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, సాంఘిక శాస్త్రం, చిల్మల్‌మైలారంలో తెలుగు, ఆంగ్లం, గణితం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులను కేటాయించారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: తాండూరు మండలానికి 13 మంది కొత్తగా వచ్చారు. 7 మంది ఎస్ఏలు, 6 గురు ఎస్‌జీటీలు ఉన్నారు. ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది మమతకు నియామక పత్రం అందజేశారు. నూతన ఉపాధ్యాయులను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జొన్నల వినోద్‌కుమార్, కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాం నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌లు స్వాగతం పలికారు.


పెద్దేముల్: నియామక పత్రాలు అందచేస్తున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

వీధి నాటకాలను ప్రోత్సహించండి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రాములు
- నేటి నుంచి వేంకటేశ్వర స్వామి వీధి నాటక ప్రదర్శన


కళాకారులకు ఆర్థిక సహాయం చేస్తున్న వెంకట్‌రాములు

దోమ: వీధి నాటకాలను ప్రోత్సహించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రాములు పేర్కొన్నారు. గురువారం నుంచి వేంకటేశ్వర స్వామి వీధి నాటకాన్ని ప్రదర్శించనున్నారని ఆయన తెలిపారు. బుధవారం ఆయన తనవంతు సాయంగా వీధినాటక కళాకారులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాచీన కాలం నాటి వీధి నాటకాలు ఎంతో ఉత్తేజపరుస్తాయన్నారు. ఆనాటి చరిత్రను అర్థవంతంగా ప్రజలకు అర్థమయ్యే రూపంలో నాటక కళాకారులు వివరిస్తారన్నారు.

తెల్లబోయిన.. తెల్ల బంగారం

- రైతు కష్టం వర్షార్పణం
- చేతికందని ఖరీఫ్ పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


ఎన్కేపల్లిలో ఎర్రబారిన మినుము

మోమిన్‌పేట: అధిక వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులకు కష్టాలను తీసుకువచ్చింది. ఖరీఫ్ పంటలు మినుము, పెసర చేతికి రాకుండపోతుందని లబోదిబోమంటున్నారు. ఎన్నో ఆశలతో తెల్ల బంగారం సాగు చేస్తే అదీ తెల్లబోయింది. ఆగస్టు మొదటి వారం వరకు ఊరించిన పత్తి ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలకు గూడ, పూత రాలి, చెట్లు ఎర్రబారాయి. చెట్టుకు నాలుగైదు కాయలు ఉంటే అవీ పూర్తిగా నల్లబారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎలాంటి లాభం చేకూరకపోగా నష్టాలనే తెచ్చిపెట్టాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 80శాతం భూ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. పత్తి విత్తింది మొదలు నేటివరకు ఎంతో ఖర్చుతో కూడుకున్నది. దీంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే సూచనలు లేవని రైతన్నలు నిరాశలో ఉన్నారు. కలుపు, గుంటుక, మందుల పిచికారీ, కూలీలు విటన్నింటికీ ఎదురేగి సాగు చేస్తే వరుణదేవుడు కక్షకట్టాడని వాపోతున్నారు. పత్తి చెట్లు ఆకు రాలి ఎండిపోయాయి. నాలుగైదు కాయలు నల్లబడి పోవడంతో పత్తి దిగుబడులపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరుతున్నారు.

రెండెకరాల్లో మినుము సాగు..

రెండెకరాల్లో మినుము సాగు చేశా. మొదట్లో పంట బాగానే వచ్చింది. పంట తీసే సమయంలో ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పూర్తిగా నేలబారింది. గింజలకు మొలకలు వచ్చాయి. వాటిని తీసేందుకు కూడా వరుణుడు సమయం ఇవ్వలేదు. ప్రభుత్వం తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– నాగయ్య, రైతు, ఎన్కేపల్లి

మూడెకరాల్లో పత్తి...



మూడెకరాల్లో పత్తి సాగు చేశా. ఆగస్టు మొదటి వారం వరకు పంట బాగానే ఉంది. ఆ తర్వాత ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గూడ, పూత రాలిపోయింది. ఎర్రగా మారింది. ప్రస్తుతం ఆకు రాలి, ఉన్న నాలుగైదు కాయలు నల్ల బడిపోయాయి. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు.

– యండీ సిరాజోద్దీన్, రైతు, ఎన్కేపల్లి